

విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



పదిలో మనం చిట్టచివర

- జిల్లా ఉత్తీర్ణత శాతం 62.47
- ఈసారి కూడా బాలికలదే పై చేయి..
- బాలుర ఉత్తీర్ణత శాతం 57.22
- బాలికల ఉత్తీర్ణత శాతం 68.35


ఎస్.సాయి స్వాతేజ్ (597/600)
కే.వాసవి ప్రియ (596/600)
షేక్ రోషిణి (596/600)
నాగ శృతి హర్షిణి (595/600)
హరిత (594/600)
షేక్ ఉమేరా ఇక్బాల్ (593/600)

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 22: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా అట్టడుగున 26వ స్థానంలో నిలిచింది. ఈ పరీక్షలు మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జరిగాయి. ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది. అతి తక్కువ వ్యవధిలో కేవలం 22 రోజుల్లోనే రికార్డు స్థాయిలో రాష్ట్ర విద్యాశాఖ ఫలితాలు విడుదలచేసింది. కర్నూలు జిల్లాలో 489 ఉన్నత పాఠశాలల నుంచి 37,802 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 19,242 మంది విద్యార్థులు పాసయ్యారు. 62.47 శాతం జిల్లా ఉత్తీర్ణత నమోదైంది. బాలురు 9313 మంది పాసై 57.22 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. బాలికలు 9929 మంది పాసై 68.35 శాతం నమోదు చేసి ముందంజలో నిలిచారు. జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే.. గత ఏడాది కంటే అదనంగా 1.89 శాతం ఉత్తీర్ణత పెరిగింది. గత ఏడాది ఉత్తీర్ణత 60.58 శాతం కాగా, ఈ ఏడాది 62.47 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో కర్నూలు వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాల విద్యార్థి ఎస్.సాయి స్వాతేజ్ 597/600 మార్కులు, బుధవారపేట శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని కోట్రికే వాసవిప్రియ 596/600, జి. హారిక 596/600, రోహిణి 596/600, కె. అనురాధ 595/600 మార్కులు, కర్నూలు విద్యానగర్ మాంటిస్సోరి హై స్కూల్ విద్యార్థి నాగశృతి హర్షిణి 595/600, కర్నూలు వెంకటరమణ కాలనీ నారాయణ పాఠశాల విద్యార్థిని హరిత 594/600, కర్నూలు డా. ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ హై స్కూల్ విద్యార్థిని షేక్ ఉమేరా ఇక్బాల్ 593/600 మార్కులు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు.

గత ఆరు సంవత్సరాల నుంచి పదో తరగతి ఫలితాలు ఇలా ఉన్నాయి

సంవత్సరం	హాజరైన విద్యార్థులు			ఉత్తీర్ణత			శాతం		
	బాలురు	బాలికలు	మొత్తం	బాలురు	బాలికలు	మొత్తం	బాలురు	బాలికలు	మొత్తం
2018-19	27407	23384	50791	25125	21655	46780	91.67	92.61	92.1 శాతం
2019-20	28010	24258	52268	28010	24258	52268	100	100	100 శాతం
2020-21	27907	24450	52357	27907	24450	52357	100	100	100 శాతం
2021-22	27302	24367	51669	15010	15059	30069	54.98	61.80	58.20 శాతం
2022-23	15258	13528	28786	8527	8912	17439	55.89	65.88	60.58 శాతం
2023-24	16276	14526	30802	9313	9929	19,242	57.22	68.35	62.47 శాతం

జిల్లాలో శ్రేణుల వారీగా ఉత్తీర్ణత శాతం

కర్నూలు జిల్లాలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ శ్రేణిలో 13,183 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ శ్రేణిలో 3877 మంది, తృతీయ శ్రేణిలో 2182 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఇది క్వాలిటీ రిజల్ట్



జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం వల్లన ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఇది క్వాలిటీ రిజల్ట్. అయితే.. గత ఏడాది ఉత్తీర్ణత శాతం కంటే 1.89 శాతం అదనంగా పెరిగింది. తగ్గిన ఉత్తీర్ణత శాతాన్ని దృష్టిలో పెట్టుకుని వేసవి సెలవుల అనంతరం పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ఏ సబ్జెక్టులో తక్కువ ఉత్తీర్ణత సాధించారో వాటిని విశ్లేషించి తక్కువ రావడానికి గల కారణాలు తెలుసుకుని వచ్చే ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఉత్తీర్ణత శాతం తగ్గినా, క్వాలిటీ రిజల్ట్ ఇచ్చామనే సంతృప్తి ఉంది.
- శామూయేల్, జిల్లా విద్యాశాఖ అధికారి

16 ఏళ్ల తర్వాత తగ్గిన ఉత్తీర్ణత

బనవాసి ఏపీఆర్‌జేసీలో 97.22 శాతం


కె. అజయ్

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 21: బనవాసి ఏపీఆర్‌జేసీ (బాలికల) ఉన్నత పాఠశాలలో 16 సంవత్సరాల తర్వాత ఉత్తీర్ణత శాతం తగ్గింది. ప్రతియేటా ఈ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత వచ్చేది. అయితే ఈ ఏడాది మాత్రం పాఠశాలలో ఉత్తీర్ణత శాతం 97.22కు పడిపోయింది. పాఠశాలలో మొత్తం 72 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా 70 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఇద్దరు ఇద్దరు విద్యార్థినులు ఫెయిల్ అయ్యారు. సప్లిమెంటరీ పరీక్షల్లో ఆ ఇద్దరు విద్యార్థులు కూడా ఉత్తీర్ణత చెంది మళ్లీ వందశాతం పాస్ పర్సంటేజీ సాధిస్తామని ఏపీఆర్‌జేసీ ఉపాధ్యాయులు తెలిపారు. బనవాసి గురుకుల పాఠశాలలో సృజన, రాజ్యలక్ష్మి 587 మార్కులు సాధించారు. అదేవిధంగా ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్లు ఉన్నత పాఠశాల విద్యార్థి కె.అజయ్ 600 మార్కులకు 594 సాధించి సత్తా చాటాడు.

ఆరేకల్ విద్యార్థినికి 593


త్రివేణి

దేవనకొండ : ఎమ్మిగనూరు మండలం ఆరేకల్‌లోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటింది. దేవనకొండ మండలంలోని తెర్నేకల్‌కు చెందిన ఉప్పర దేవనకొండ నగేష్, లక్ష్మీ దంపతుల కుమార్తె దేవనకొండ త్రివేణి 593 మార్కులు సాధించి శభాష్ అనిపించుకుంది. కాగా నగేష్ ఆటో డ్రైవర్.

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాలు ఇలా..

ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో 372 మందికి గాను 363 మంది పాసై 97.58 శాతం, బీసీ వెల్ఫేర్‌లో 254 మందికి 242 మంది పాసై 95.28 శాతం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో 540 మందికి గాను 452 మంది పాసై 83.72 శాతం, ఆదర్శ పాఠశాలలో 1404 మందికి 1050 మంది పాసై 74.79 శాతం, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 77 మందికి 54 మంది పాసై 70.13 శాతం, ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ 78 మంది 54 మంది పాసై 69.23 శాతం, కేజీబీవీలలో 929 మందికి 550 మంది పాసై 59.2 శాతం, మున్సిపల్ పాఠశాలలో 1958 మందికి 1033 మంది పాసై 52.76 శాతం, ప్రభుత్వ పాఠశాలలో 1894 మందికి 951 మంది పాసై 50.21 శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14,173 మందికి 6,281 మంది పాసై 44.32 శాతం, ఎయిడెడ్ పాఠశాలలో 172 మందికి 73 మంది పాసై 42.44 శాతం, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో 8951 మందికి 8131 మంది పాసై 90.93 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

మీడియంల వారిగా: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లీషు మీడియం విభాగంలో 20,167 మంది పరీక్షలు రాయగా.. 15,038 మంది పాసై 74.57 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే కన్నడ మీడియంలో 448 మందికి 229 మంది పాసై 51.12 శాతం, ఇందులో బాలురు 89 మంది పాసై 41.98 శాతం, బాలికలు 59.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే తెలుగు మీడియంలో 9,750మంది పరీక్ష రాయగా.. 3,612 మంది పాసై 37.05 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 1471 మంది పాసై 28.88 శాతం, బాలికలు 2141 మంది పాసై 45.98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉర్దూ మీడియంలో 437 మందికి గాను 363 మంది పాసై 83.07 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సబ్జెక్టుల వారిగా: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సబ్జెక్టు వారిగా ఉత్తీర్ణత వివరాలు ఇలా ఉన్నాయి. ఫస్ట్ లాంగ్వేజ్ 30786 మందికి గాను 27846 మంది పాసై 90.45 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే సెకండ్ లాంగ్వేజ్‌లో 30,761 మందికి 30,188 మంది పాసై 98.14 శాతం, థర్డ్ లాంగ్వేజ్‌లో 30,074 మందికి 29,238 మంది పాసై 95.23 శాతం, గణిత శాస్త్రంలో 30,802 మందికి 23,004 మంది పాసై 73.67 శాతం, జనరల్ సైన్స్‌లో 30,802 మందికి 23,004 మంది పాసై 74.68 శాతం ఉత్తీర్ణత సాధించారు. సోషల్ స్టడీస్‌లో 30,802 మందికి 24,046 మంది పాసై 79.36 శాతం సాధించారు.

మోదీ విధ్వంసకర పాలన

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 22: ప్రశ్నించే ప్రతిపక్షపార్టీలను అవినీతి కుంభకోణాల పేరుతో ఈడీ, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంటు ప్రయోగించి బెదిరిస్తూ ప్రధాని మోదీ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాడని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ధ్వజమెత్తారు. సోమవారం పత్తికొండకు వచ్చిన ఆయన స్థానిక సీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో వేలకోట్ల కుంభకోణాలకు, దేశ సంపదను కొల్లగొట్టి దోచుకున్న వారంతా మోదీ వారసులే అన్నారు. ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలను బెదిరిస్తూ ఏ అవినీతికి పాల్పడకపోయినా సీఎం లాంటి వ్యక్తులను జైలులో ఉంచుతూ.. దేశప్రధాని బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో విధ్వంసకర పాలన సాగుతుందన్నారు. దూరదర్శన్ సింబల్‌నే మార్చేసిన ఘనుడు మోదీనే అన్నారు. రూ.లక్షల కోట్లు దోచుకున్న సీఎం జగన్ రెడ్డి ఏళ్ల తరబడి బెయిల్‌పై బయట తిరగడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ అండతోనే జగన్ జైలుకెళ్లకుండా ఉన్నాడనీ ఆరోపించారు. రాష్ట్రంలో గులకరాయి డ్రామాకు జగన్ తెరలేపారన్నారు. గులకరాయితో సీఎం చంపడమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నాయకులు రాజాసాహేబ్, కారన్న, డీసీసీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, భీమలింగప్ప, లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

3 రోజులే గడువు

- ఇప్పటిదాకా 80 నామినేషన్లు దాఖలు
- నామినేషన్ దాఖలు చేసిన టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు


నామినేషన్ వేసేందుకు వెళ్తున్న ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

కర్నూలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా సోమవారం అత్యధికంగా నామినేషన్లు దాఖలయ్యాయి. మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయడంలో వేగాన్ని పెంచుతున్నారు. సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు 36 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటివరకు మొత్తం 80 సెంట్ల నామినేషన్లు వచ్చాయి. బుధవారం మంచి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. కర్నూలు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు ఆ పార్టీ జిల్లా ప్రముఖ నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక గాయత్రీ ఎస్టేట్ దగ్గర ఉన్న టీడీపీ కార్యాలయం నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జోన్-5 ఇన్‌చార్జి బీద రవిచంద్ర యాదవ్, పార్లమెంటు ఎన్నికల పరిశీలకులు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కర్నూలు, పత్తికొండ టీడీపీ అభ్యర్థులు టీజీ భరత్, కేఈ శ్యాంబాబు తదితరులతో కలిసి ఊరేగింపుగా వెళ్లి నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్, స్వతంత్ర అభ్యర్థిగా కోటికల్లు వడ్డె ఉరుకుంద నామినేషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉండగా ఆలూరు టీడీపీ అభ్యర్థి బి.వీరభద్రగౌడు, ఆయన కుమారుడు బి.గిరిమల్లేష్‌గౌడు నామినేషన్లు ఆర్వోకు అందజేశారు. పత్తికొండ నుంచి ఆరు నామినేషన్లు రాగా ఇండియా కూటమి తరుపున సీపీఐ అభ్యర్థి పి.రామచంద్రయ్య, వైసీపీ అభ్యర్థి శ్రీదేవి నామినేషన్లు వేశారు. ఎమ్మిగనూరు నుంచి టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆయన సతీమణి బీవీ నిత్యదేవి నామినేషన్లు వేయగా.. వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక కూడా నామినేషన్ వేశారు. పాణ్యం నుంచి ఇండియా కూటమి తరుపున సీపీఎం అభ్యర్థి గౌస్ దేశాయ్, వైసీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి నామినేషన్లను ఆర్వో, కర్నూలు జేసీ నారపురెడ్డి మౌర్యకు అందజేశారు. కోడుమూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మురళీకృష్ణ సహా ఐదుగురు నామినేషన్లు వేశారు. మంత్రాలయం నుంచి టీడీపీ అభ్యర్థి మాధవరం నల్లగౌని రాఘవేంద్రరెడ్డి, వైసీపీ అభ్యర్థి బాలనాగిరెడ్డి, ఆదోని నుంచి వైసీపీ అభ్యర్థి వై.సాయిప్రసాద్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.


కలెక్టరేట్ ఎదుట తెలుగుతమ్ముళ్ల నినాదాలు

కీలక భేటీ

- కేఈ బ్రదర్స్‌తో టీడీపీ నేతల చర్చ
- ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘ మంతనాలు


మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తితో భేటీ అయిన టీడీపీ నేతలు

కర్నూలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మాజీ డిప్యూటీ సీఎం, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి వయోభారం, ఆరోగ్యం రీత్యా ప్రస్తుతం ఎన్నికలకు దూరంగా ఉన్నారు. సోమవారం టీడీపీ కీలక నాయకులు ఆయన్ను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జోన్-5 ఇన్‌చార్జి బీద రవిచంద్ర యాదవ్, కర్నూలు పార్లమెంట్ పరిశీలకుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడులు కేఈ కృష్ణమూర్తిని కర్నూలులో ఆయన స్వగృహంలో కలిశారు. జిల్లాలో రాజకీయాలు, తాజా ఎన్నికల్లో టీడీపీ గెలుపు వ్యూహాలపై చర్చించారు. పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలకు సంబంధించి కేఈ పలు సూచనలు చేశారు. టీడీపీ టికెట్ ఇవ్వకపోగా.. తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని అసంతృప్తిగా ఉన్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌ను ఆయన ఫాంహౌస్‌లో టీడీపీ బృందం కలిసింది. ఈ భేటీలో పలు రాజకీయ అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఆదోనిలో కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథికి.. టీడీపీ, జనసేన నాయకుల మధ్య సమన్వయం కోసం చర్చలు జరిపారు. అంతకు ముందు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్లమెంటు, అసెంబ్లీ టీడీపీ అభ్యర్థుల నామినేషన్లపై కీలక నాయకులు చర్చించారు.


కేఈ ప్రభాకర్‌తో సమావేశమైన నాయకులు

చంద్రబాబుకు ఘన స్వాగతం

- శ్రీశైల మల్లన్న సేవలో చంద్రబాబు దంపతులు
- పుణ్యక్షేత్రంలో బీ-ఫారంలు అందుకున్న బుడ్డా, బీసీ



బయలు వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న చంద్రబాబు దంపతులు


స్వామి, అమ్మవార్ల దర్శనానికి వెళ్తున్న నారా చంద్రబాబు, నారా భువనేశ్వరి

శ్రీశైలం, ఏప్రిల్ 22: శ్రీశైలం పర్యటనకు వచ్చిన మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ కీలక నాయకులు ఘన స్వాగతం పలికారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు సోమవారం చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి శ్రీశైలానికి వచ్చారు. ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్‌కు చంద్రబాబు చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్దకు చేరుకోగానే చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్యేలు బీసీ జనార్ధన్ రెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి తదితరులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా చంద్రబాబు దంపతులు సాక్షిగణపతి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం శ్రీశైలం చేరుకుని క్షేత్రపరిధిలోని బయలు వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. తర్వాత స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న చంద్రబాబు దంపతులకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు దంపతులు మల్లికార్జున స్వామికి అభిషేకం, భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం చంద్రబాబు దంపతులకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం తిరిగి హెలీకాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు వెళ్లారు.

అభ్యర్థులకు బీ ఫారాలు

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం శ్రీశైలానికి విచ్చేసిన టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పలు నియోజకవర్గాల అభ్యర్థులకు బీ-ఫారంలను అందజేశారు. శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహంలో వాటిని అందజేశారు. బనగానపల్లె, శ్రీశైలం అభ్యర్థులు బీసీ జనార్దన్ రెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డిలు బీఫారంను చంద్రబాబు నుంచి అందుకున్నారు. అదేవిధంగా అనంతపురం జిల్లా రాయదుర్గం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, శ్రీసత్యసాయి జిల్లా కదిరి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్‌లు బీఫారంలను అందుకున్నారు. ఎన్నికల్లో మంచి పోల్‌మేనేజ్‌మెంట్ నిర్వహించి ఘన విజయం సాధించాలని చంద్రబాబు అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.


శ్రీశైలం దేవస్థానంలో చంద్రబాబు దంపతులతో టీడీపీ నాయకులు

సీనియర్ సిటిజన్

నాడు చేతులెత్తి ఓటు తెలిపేవాళ్లం



దేవనకొండ, ఏప్రిల్ 22: స్వాతంత్య్రం అనంతరం ఓటు వచ్చిందని, నాడు ఓటు అంటే చేతులెత్తి తెలిపేవాళ్లమని దేవనకొండకు చెందిన 94 యేళ్ల వృద్ధురాలు కాకర్ల మంగమ్మ తెలిపారు. గ్రామంలో నిర్ణయించిన ప్రదేశంలో ఒక చోట (పీర్ల మసీదు, మారెమ్మగుడి)కు గ్రామ ప్రజలు వచ్చే వాళ్లని, అక్కడ అభ్యర్థుల పేర్లు ప్రకటించినప్పుడు చేతులెత్తి ఓటు వేసేవారని వివరించారు. ఎక్కువ మంది చేతులు ఎత్తితే ఆ అభ్యర్థి విజయం సాధించినట్లని చెప్పారు. ప్రస్తుతం చాలా మార్పులు వచ్చాయన్నారు. నాడు చదువుకున్న వారి సంఖ్య చాలా తక్కువన్నారు. ఆ రోజుల్లో డబ్బు ప్రభావం ఉండేది కాదని, మాటకు కట్టుబడి ఓటు వేసేవారని తెలిపారు.

అప్పుడు అభిమానం.. ఇప్పుడు డబ్బు



బండిఆత్మకూరు, ఏప్రిల్ 22: నా వయస్సు సుమారు 80 ఏళ్లు. ఇప్పటికి 12 దఫాలు ఓట్లు వేశాను. మేము ఆ రోజుల్లో అభిమానం ఉన్న నాయకుడికి మాటిచ్చే వాళ్లం. వారికే వేసే వాళ్లం. నేడు డబ్బు ఎవరు ఎక్కువ ఇస్తే వాళ్లకు, ఉచిత పథకాల ఎరకు ఓటు వేస్తున్నారు. ఓటుకు ముందు ఉచితాలు ఎర వేసి గద్దెనెక్కిన తరువాత మనతో ఉన్నదంతా లాగేస్తారు. ఓటు మన ఆయుధం అది ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలి. అమ్ముడు పోరాదు. గతంలో ఓట్ల రోజు ఉదయాన ఉప్పిండి లేక ఉగ్గాని పెట్టేవారు. అయినా కొందరం దాన్ని కూడా తీసుకునే వాళ్లం కాదు.

- ఆరేలి లింగన్న, పెద్దదేవళాపురం


నాడు ఇచ్చేవారు లేరు.. అడిగే వారు లేరు



ఎమ్మిగనూరు, ఏప్రిల్ 22: నావయస్సు 72 ఏళ్లు. ఇప్పటికి పదిసార్లు ఓటు వేసి ఉంటా. నాకు ఓటు హక్కు వచ్చిన సమయంలో.. ఎన్నికలంటే ఏమో తెలిసేది కాదు. ఇప్పటిలా అప్పట్లో ఎవరు ఓటు వేసేందుకు డబ్బు అడిగే వారు కాదు.. అలాగే ఓటు వేసేందుకు ఎవరు డబ్బు ఇచ్చే వారు కాదు. ఎన్నికల సమయంలో తేరు బజారులో మాచాని సోమప్ప మీటింగ్ పెట్టి చేప్పేవారు. ఆయన చెప్పిన ప్రకారం చేసేవారం. ఎన్నికలంటే తెలిసి వచ్చింది ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు, తెలుగుదేశం వచ్చిన తరువాతే. అంత వరకు మా బోటి వాళ్లకు ఎన్నికల గురించి తెలిసేది కాదు. మంచి ప్రభుత్వం రావాలని ఓటు వేసేవాడ్ని. అయితే ఇప్పుడు అంతా డబ్బు మయంగా మారింది. ఎన్నికలు వచ్చాయంటే ఎవరు డబ్బు ఇస్తారు.. ఎంత ఇస్తారు.. ఎక్కువ ఎవరు ఇస్తారు అని చూస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు.

- బండ బసన్న, ఎమ్మిగనూరు

మాట ఇచ్చిన వారికే ఓటు వేసేవారు



పాణ్యం, ఏప్రిల్ 22 : గతంలో ఓటు వేసేవారు నిక్కచ్చిగా ఉండేవారు. ఎవరికి మాట ఇచ్చారో వారికే ఓటు వేసేవారు. గ్రామంలోని రెండు వర్గాలు ఉంటే ఆ పార్టీ నాయకులకు నిక్కచ్చిగా ఓటు వేసేవారు. ఎన్నికల సమయంలో డబ్బులతో ప్రలోభపెట్టేవారు కాదు. పేటలోని తమ వర్గాలకు పెళ్లిళ్లకు అవసరమయ్యే శాశ్వతమైన షామియానాలు, వంట పాత్రలు, దుప్పట్లు ఇచ్చేవారు. ఎన్నికల రోజు ఉదయాన్నే ఓటు వేసేందుకు రావాలని బొరుగుల బస్తాలు ఇచ్చి వంట చేయించి పోలింగ్‌కు వెళ్లే వాళ్లు. అభ్యర్థికి ఇచ్చిన మాట ప్రకారం వారికే ఓటు వేసేవారు. డబ్బులు పంచి ప్రలోభాలకు గురి చేసేవారు కాదు. ప్రస్తుతం డబ్బు ఇచ్చినా ఓటు వేస్తారన్న నమ్మకం లేదు. ఎవరికి ఓటు వేశారో గర్వంగా చెప్పుకునేవారు. ఇప్పుడు ఎవరికి ఓటు వేశామో చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో గ్రామ సమస్యలను గుర్తించిన నాయకునికే పట్టం కట్టేవారు. కాంగ్రెస్, జనతా పార్టీలు ఉండేవి. స్వతంత్ర అభ్యర్థులు పాణ్యం నుంచి గెలిచి ఎమ్మెల్యేలయ్యారు.



సామాన్యుల సంజీవని

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి
- నిజాయితీకి నిలువెత్తు రూపం
- నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం
- ఆయనే మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య


కర్నూలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):

దామోదరం సంజీవయ్య.. భారత ప్రజాస్వామ్య కీర్తిపతాక. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. యువతరానికి స్ఫూర్తిదాయకం. సంయుక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఓ దళితుడు తొలిసారిగా బాధ్యతలు చేపట్టడం దేశ రాజకీయ చరిత్రలో లిఖించదగ్గ అధ్యాయం. ముగ్గురు ప్రధానుల నాయకత్వంలో కేంద్ర మంత్రిగా.. మూడు రాష్ట్రాలు.. ముగ్గురు ముఖ్యమంత్రుల నాయకత్వంలో మంత్రిగా పని చేసిన ఆయన జీవన యానం త్రివేణి సంగమం (త్రినిటీ). అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్ష పీఠాన్ని రెండు పర్యాయాలు అధిష్టించడం సామాన్యమైన విషయం కాదు. భారత దేశ ప్రజాస్వామ్య ఘనతకు దామోదరం సంజీవయ్య జీవితం ఒక గొప్ప ఉదాహరణ అని ఓ సందర్భంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవచ్చు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిస్తే పది తరాలకు తరగని ఆస్తి పోగేసుకుంటున్న రాజకీయ నాయకుల్లో దామోదరం సంజీవయ్య లాంటి మహనీయులు దీపం పెట్టి వెతికినా కనిపించరు. అందుకే ఆయన జీవిత చరిత్ర యువతరానికి స్ఫూర్తిదాయకం.





పెద్దపాడులో దామోదరం సంజీవయ్య నివసించిన ఇల్లు



సతీమణి కృష్ణవేణితో దామోదరం సంజీవయ్య (ఫైల్)

కర్నూలు నగరం సమీపంలో కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన మునెయ్య, సుంకులమ్మ నిరుపేద దంపతులకు ఐదో సంతానం దామోదరం సంజీవయ్య. 1921 ఫిబ్రవరి 14న జన్మించాడు. ఆయన పుట్టిన మూడు రోజులకే తండ్రి మృత్యుఒడి చేరారు. మేనమామ సంరక్షణలో పెరిగారు. వ్యవసాయ కూలీ కుటుంబం కావడంతో ఆయన కుటుంబ సభ్యులు పశువులు కాసేవారు. పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేసేవారు. ఇలాంటి కుటుంబం నుంచి వచ్చిన సంజీవయ్య కర్నూలు మున్సిపల్ హైస్కూల్, అనంతపురం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో విద్యాభ్యాసం చేశారు. బ్రిటీష్ పాలనలో కర్నూలు సివిల్ సప్లయ్ విభాగం, బళ్లారి సివిల్ సప్లయ్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. అప్పుడే పరిచయమైన ఓ జడ్జి సలహాతో మద్రాసు వెళ్లి న్యాయశాస్త్ర విద్యా పూర్తి చేసి గణపతి శాస్త్రి, జస్టిస్ సీతారామక్కి దగ్గర జూనియర్ అప్రెంటిస్‌గా చేరారు. 1950లో భారత్ గణతంత్ర దేశంగా ఆవిర్భావం తర్వాత ఒక వ్యక్తికి ఒకే పదవి అనే నిబంధన వచ్చింది. అప్పటికి కర్నూలుకు చెందిన సర్దార్ నాగప్ప ఎమ్మెల్యే, ఎంపీ రెండు పదవుల్లో ఉన్నారు. ఆయన ఎమ్మెల్యే పదవి ఉంచుకొని ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఆ సీటు ఎస్సీ రిజర్వుడు కావడంతో అభ్యర్థి ఎంపిక బాధ్యత ఎన్జీ రంగాకు అప్పగించారు. ఆ సమయంలో రామలక్ష్మమ్మ తన దగ్గర జూనియర్‌గా పని చేస్తున్న సంజీవయ్యను సూచించారు. దీంతో ఆయన తాత్కాలిక ఎంపీగా బాధ్యతలు చేపట్టారు. 1952లో జరిగిన కర్నూలు నుంచి ద్విసభ్య స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మద్రాసు రాష్ట్రం ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజాగోపాలాచారి (రాజాజీ) కాబినేట్‌లో హౌసింగ్, కో-ఆపరేటివ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

● రాజకీయ ప్రస్థానం త్రివేణి సంగమం:

మద్రాసు రాష్ట్రంలో 1952 - 1953 వరకు సీఎం రాజాజీ మంత్రివర్గంలో, కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భావం తరువాత 1953 అక్టోబరు 1 నుంచి 1956 నవంబరు 1 వరకు సీఎం టంగుటూరి ప్రకాశం కాబినేట్‌లో సాంఘిక సంక్షేమ, ఆరోగ్య శాఖ మంత్రిగా, సీఎం బెజవాడ గోపాల్‌రెడ్డి క్యాబినెట్‌లో వాణిజ్య పన్నులు, స్థానిక సంస్థల పాలన శాఖ మంత్రిగా, 1956లో ఏర్పడిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి క్యాబినెట్‌లో కార్మిక, స్థానిక సంస్థల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ప్రధానమంత్రులు నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ మంత్రివర్గంలో కేంద్ర మంత్రిగా కొనసాగారు. మద్రాసు, కర్నూలు, హైదరాబాద్ కేంద్రాలుగా మూడు ప్రభుత్వాల్లో పని చేయడం విశేషమే. 1962-64 మధ్య నెహ్రూ హయాంలో, 1971-72 మధ్య ఇందిరాగాంధీ హయాంలో రెండు పర్యాయాలు అఖిల భారత జాతీయ కాంగ్రెస్ (ఏఐసీసీ) కమిటీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.

● దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి పదవి కోల్పోవడంతో.. ఆ స్థానంలో 1962లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఓ దళిత నాయకుడు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవడం దేశంలోనే ప్రథమం. రెండేళ్ల మూడు నెలలు సీఎంగా కొనసాగారు.

● కృష్ణవేణితో వివాహం:

సికింద్రాబాదులో ఉపాధ్యాయినిగా పని చేస్తున్న కృష్ణవేణితో 1954 మే 7న సంజీవయ్య వివాహం జరిగింది. వీరికి సంతానంలో లేదు. సుజాత అనే ఓ బాలికను దత్తత తీసుకున్నారని అంటున్నారు. 1967లో ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయవాడ నుంచి హైదరాబాదుకు వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై.. దీర్ఘకాలంగా కోలుకోలేకపోయారు. 1972 మే 7న ఢిల్లీలో గుండెపోటుతో మృతి చెందారు. మే 9న సికింద్రాబాదులోని పాటిగడ్డలో అంత్యక్రియలు చేశారు. ఆయన స్మారకార్థం అక్కడికి సమీపంలో సంజీవయ్య పార్కు ఏర్పాటు చేశారు. విశాఖలోని ఏపీ నేషనల్ లా యూనివర్సిటీని 2012లో దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీగా పేరు మార్చారు. గాజులదిన్నె ప్రాజెక్టును సంజీవయ్య సాగర్‌గా పేరు పెట్టారు.

తొలి కమ్యూనిస్టు ఎమ్మెల్యే ఈశ్వర్‌రెడ్డి

ది లీడర్



పత్తికొండ, ఏప్రిల్ 22: ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొలి కమ్యూనిస్టు ఎమ్మెల్యేగా ఎర్రగుడి ఈశ్వర్‌రెడ్డి పత్తికొండ సెగ్మెంట్ నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు భావాలతో పెరిగారు. గ్రామ కరణంగా పనిచేసిన ఆయన ఆ తర్వాత ఉద్యోగాన్ని వదిలి గిరిజనుల కోసం సీపీఎం తరఫున భూపోరాటాలకు దిగారు. గిరిజన ప్రజలకు సుమారు వెయ్యి ఎకరాల దాకా భూములను ప్రభుత్వం ద్వారా ఇప్పించారు. నాయకుడిగా పేదల పక్షాన పోరాటాలు చేస్తూ 1967లో పత్తికొండ నియోజకవర్గం నుంచి సీపీఎం తరపున బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేబీ నరసప్పపై 1,526 ఓట్ల ఆధిక్యంతో గెలుపొంది ఉమ్మడి జిల్లాలో తొలి కమ్యూనిస్టు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేబీ నరసప్ప చేతిలో ఆయన ఓడిపోయారు. ప్రజల పక్షాన పోరాటాలు చేసిన ఆయన 1979 ఆగస్టు 4వ తేదీ ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురయ్యారు.

పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు

తెలుసుకుందాం



ఆదోని, ఏప్రిల్ 22: ఎన్నికల అధికారులు మూడు రకాలుగా పోలింగ్ కేంద్రాలను విభజించారు. ఇందులో ఒకటి సాధారణ పోలింగ్ కేంద్రం, రెండోది సమస్యాత్మక పోలింగ్ కేంద్రం, మూడోది అతి సున్నితమైన పోలింగ్ కేంద్రం. ఈ కేంద్రాల్లో రాజకీయ పార్టీలు తమ అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు ఇతరేతర సమస్యలు దృష్టిలో ఉంచుకొని ఈ విధమైన చర్యలు తీసుకుంటారు. గతంలో పోలింగ్ కేంద్రాల్లో నెలకొన్న ఘటనల ఆధారంగా వీటిని మూడు రకాలుగా విభజిస్తారు. సాధారణ పోలింగ్‌కేంద్రం కంటే అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. ముందస్తు చర్యలను పోలీసులు తీసుకుంటారు. వీటిని ఇప్పటికే జియో ట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేశారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షించనున్నారు.

అభ్యర్థి చరిత్ర మన చేతిలోనే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల పూర్తి వివరాలు తెలుసుకోవడం ఇక సులువు. నామినేషన్ వేయగానే ఆ వివరాలను అభ్యర్థులు రిటర్నింగ్ ఆఫీసర్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇందుకోసం ఎన్నికల కమిషన్ affidavit.eci.gov.in వెబ్‌సైట్‌తో పాటు కొత్తగా know your candidate యాప్‌ను తీసుకువచ్చింది. ఇక్కడ అభ్యర్థి పేరు, నియోజకవర్గం పేరు, స్టేట్‌ను ఎంపిక చేసుకోవాలి. దీనిలో అఫిడవిట్, అభ్యర్థి నేర చరితతో పాటు వారికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి.

జీపులు, ఆటోలకు గిరాకీ


భలే చాన్సులే..!



గోనెగండ్ల, ఏప్రిల్ 22: ఎన్నికల ముందు వరకు జీపుల యజమానులు, ఆటో డ్రైవర్‌లు బాడుగలు లేక డీలపడిపోయారు. ఈఎంఐలు కట్టలేక ఇబ్బందులు కూడా పడ్డారు. ఇక ఎన్నికల వేడి ఎప్పుడు మొదలైందో అప్పటి నుంచి జీపు యజమానులకు డ్రైవర్‌లకు, ఆటో డ్రైవర్లకు మంచి గిరాకీ వచ్చింది. రాజకీయ పార్టీల నాయకులు మండల కేంద్రాల నుంచి పల్లెలకు ప్రచారం నిమిత్తం వెళ్తుంటారు. వారికి జీపులు, ఆటోలు కావాల్సి ఉంది. దీంతో రాత్రే జీపు, ఆటో డ్రైవర్‌లతో మాట్లాడి ఉదయం కాగానే గ్రామాలకు ప్రచారానికి వెళ్తున్నారు. జీపునకు రోజుకు రూ.3000, డ్రైవర్ బత్త, డీజిల్, అదనం. ఇక ఆటోకు రూ. 1500, డ్రైవర్ బత్త, డీజిల్‌ను ఆయా రాజకీయ పార్టీ నాయకులే భరించాలి. దీనికి తోడు గ్రామాల్లో ప్రచారం కోసం ఉదయం వెళ్తారు. కార్యకర్తలతో పాటు డ్రైవర్‌లకు కూడా టిఫిన్ సౌకర్యం ఉంటుంది. గ్రామంలో రాజకీయ పార్టీల నాయకులు ఉదయం 6గంటలకు ప్రచారం ప్రారంభించి 10 గంటలకు ముగించుకొని తాము తీసుకువెళ్లిన వాహనాలలో తిరిగి గ్రామానికి చేర్చుతారు. గ్రామాలలో ప్రచారం ముంగించుకొని వాహనం దగ్గరకు వచ్చే వరకు జీపు, ఆటో డ్రైవర్‌లకు విరామమే. ఇక సాయంత్రం మరోసారి 5గంటల నుంచి 7 గంటల వరకు ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారు. ఇక ఆరోజు ప్రచారం ముగిసిపోతుంది. సాయంత్రం కార్యకర్తలకు ఇచ్చే మందు బాటిల్ కోటాలోనే డ్రైవర్‌లకు క్వాటర్ బాటిల్ వస్తుంది. పెద్దగా కష్ట పడకుండా జీపు, ఆటో డ్రైవర్‌లకు మంచి భలే గిరాకీ వచ్చింది. రెండు నెలల ఈఎంఐలకు ఎలాంటి ఇబ్బంది లేదని వాహనాల యజమానులు తెలుపుతున్నారు.

ఎవరికి ఓటు వేశామో చూసుకోవచ్చు

టెక్నాలజీ



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22: ఈవీఎంలో మనం ఎవరికి ఓటు వేశామో చూసుకోవచ్చు. నచ్చిన అభ్యర్థి పార్టీకి వేసిన ఓటు సక్రమమేనా లేక క్రాస్ అయిందా అనే అనుమానాన్ని నివృత్తి చేసుకోవచ్చు. అయితే.. ఈ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఓటరు వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) ద్వారా కల్పిస్తోంది. వేసిన ఓటును చూసుకునే అవకాశం ఏడు సెకండ్ల వరకు మాత్రమే ఉంటుంది. అనంతరం ఆ ఓటు వీవీ ప్యాడ్ బాక్స్‌లో పడిపోతుంది. ఈ విధానాన్ని తొలిసారిగా 2013 సెప్టెంబరులో నాగాలాండ్‌లోని నోక్సెన్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాల్లో అమలు చేశారు. ఆ తర్వాత దశల వారిగా అంతటా అమల్లోకి వచ్చింది. వేసిన ఓటును సెల్‌ఫోన్ ద్వారా చిత్రీకరించడం, బహిర్గతం చేయడం మాత్రం నిషేధం. ఉల్లంఘిస్తే ఓటు రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.



ప్రచార కూలి రూ.500

మంచి తరుణం

సార్వత్రిక ఎన్నికలు వ్యవసాయ, దినసరి కూలీలకు భలే గిరాకి తెచ్చిపెట్టాయి. ప్రతి రోజూ గ్రామాల్లో రాజకీయ సమావేశాలు, మీటింగ్‌లు ప్రచారాలు ఉండటంతో వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లకుండా రాజకీయ సమావేశాలు, ప్రచారాలకు వెళ్తున్నారు. ప్రచారాలకు, మీటింగ్‌లకు వెళితే రోజుకు రూ.500 నుంచి రూ. 1000 వరకు, బిర్యానీ, మందు బాటిల్ ఇస్తారు. మహిళలకైతే డబ్బు, బిర్యానీతో పాటు మరో వంద రూపాయలు అదనంగా ఇస్తున్నారు. అధికార పార్టీ నాయకులే అధికంగా ఓటర్లకు మద్యం, డబ్బు ఎర చూపుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా లేక పోవడంతో కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేయిస్తున్నారు. అయితే ఉపాధి పనులకు వెళ్తే రూ. 250కు మించి ఇవ్వడం లేదు. రాజకీయ మీటింగ్‌లకు, ప్రచారాలకు వెళితే సాయంత్రంలోగా డబ్బులు అందుతాయి. దీంతో ఒక్కొక్క ఇంటి నుంచి ఇద్దరు నుంచి ముగ్గురు వరకు రాజకీయ ప్రచారాలకు వెళ్తున్నారు. పొలం పనుల్లో కష్టపడి పని చేసేకంటే ఇదే బాగుంది అని కూలీలు మాట్లాడుకుంటున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం బిర్యానీ, రాత్రి మందు బాటిల్‌తో పాటు రూ.500 నుంచి రూ. 1000 వస్తుంది. మరో 20 రోజుల వరకు ఇదే పని ఉంటుందని, పొలం పనులకు వెళ్లేది లేదని కూలీలు తెలుపుతున్నారు.

- గోనెగండ్ల



- సోషల్ మీడియా వేదికగా ప్రచారం
- హోరెత్తిస్తున్న అభ్యర్థులు
- పోస్టు పెట్టు.. ఫాలోవర్స్‌ను పట్టు

ఆదోని, ఏప్రిల్ 22: సోషల్ మీడియా.. ఇప్పుడు ఇదో పెద్ద వేదిక.. అరచేతిలో ఉన్న అద్భుత టెక్నాలజీ. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి సోషల్ మీడియానే ప్రథమ ఆయుధంగా ఎంచుకుంటున్నారు. ఎలక్షన్ నేపథ్యంలో లక్షల సంఖ్యలో ఫాలోవర్స్ ఉండే సోషల్ మీడియా పేజీలను కొందరు డబ్బులకు అమ్మేస్తున్నారు. ఒక్కో ఫాలోవర్‌కు మూడు నుంచి ఐదు వేల వరకు ధర నిర్ణయిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఏపీలోని ప్రధాన నగరాల్లో వీటికి భలే డిమాండ్ ఉండేదని సోషల్ మీడియా స్ట్రాటజిస్టులు చెబుతున్నారు.

సోషల్ మీడియాలో పోస్టుల కంటెంట్ నచ్చితేనే ఎక్కువ మంది వారిని ఫాలో అవుతూ ఉంటారు. ఉదాహరణకు కొందరు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ఎక్స్‌లో ఒక పేజీని ప్రారంభిస్తారు. ప్రస్తుతం ఉన్నటువంటి రాజకీయ పరిస్థితులు ప్రజలకు చేరువయ్యే విధంగా పోస్టులను పెడుతుంటారు. అనంతరం అవి వైరల్ అయిన తరువాత అడ్మిన్‌లు ఈ పేజీలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి రాజకీయ పరిణామాలకు సంబంధించిన వీడియోలు, వాళ్లని కామెంట్ చేస్తూ మీమ్స్.. ఈ విధంగా నిత్యం ఏదో ఒకటి పోస్టు చేస్తుంటారు. ఇలా పెట్టిన పోస్టు లేదా వీడియో వైరల్ అయి నెల రోజుల్లోనే లక్షల్లో ఫాలోవర్స్‌ను సొంతం చేసుకుంటాయి. ఈ విధంగా ఫాలోవర్స్ పెరిగిన తరువాత అడ్మిన్‌ను తొలగిస్తారు. ఒక్క ఫాలోవర్ నుంచి రూ.3 నుంచి రూ.5వేల రూపాయలకు కొంటారు. ఎవరైనా డబ్బు చెల్లిస్తే ఖాతాను వారి పేర్ల మీద మార్చేస్తారు. ఈ విధంగా సోషల్ మీడియా స్ట్రాటజిస్టులకు భలే డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలోనే వివిధ పార్టీల అభ్యర్థులు, ఆశావాహులు వీరిని తాత్కాలికంగా నియమించుకుంటున్నారు. వాళ్లు చేసేటువంటి పర్యటనలు, ప్రసంగాలు నియోజకవర్గ స్థాయిలో ప్రజలను ఆకట్టుకునే విధంగా పోస్టులు పెడుతున్నారు. ఈ విధంగా సామాజిక మాధ్యమాలలో చాలా మంది అభ్యర్థులు దూసుకుపోతున్నారు.

జాతీయ జెండాకు అవమానం



ఎమ్మిగనూరు సర్కిల్లోని పోలీస్ కంట్రోల్ రూం దగ్గర ఏర్పాటు చేసిన బ్యానెర్‌లో జాతీయ జెండా తలకిందులుగా ఉన్న దృశ్యం

ఆదోని, ఏప్రిల్ 22: అసెంబ్లీ ఎన్నికల అధికారి పేరుపై వేయించిన 'ఓటు వేయడం మన హక్కు' అనే డిస్ప్లే బ్యానర్‌లో భారత జాతీయ జెండాకు అవమానం జరిగింది. జాతీయ జెండాను అవమానించే విధంగా ఎన్నికల అధికారులు ముద్రించడం ప్రభుత్వ అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనం. జాతీయతకు భంగం కలిగే విధంగా అధికారుల నిర్వాకం ఉండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వంద శాతం ఓటింగ్‌ను జరిపేందుకు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అయితే అందులో భాగంగానే ప్రచార మాధ్యమాల్లో ఆదోని ప్రచార బోర్డులో జాతీయ జెండాను తలకిందులుగా వేసి అవమానపరిచారు. జాతీయ జెండాను అవమానపరిచిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నాగరాజ్ గౌడ్ తెలిపారు.



ఆదోని పట్టణ నడిబొడ్డున తలకిందులుగా ఉన్న జాతీయ జెండా బ్యానెర్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా


టీడీపీలో చేరిన మున్సిపల్ వర్కర్స్‌తో టీజీ భరత్


మౌర్యఇన్ పరిణయ హాలులో మాట్లాడుతున్న టీజీ భరత్

టీడీపీలో చేరిన వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు
కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 22: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. నగరంలోని ఆయన కార్యాలయంలో వైసీపీకి అనుబంధంగా ఉన్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వైవీ రమణతోపాటు మున్సిపాలిటీ రెగ్యులర్ యూని యన్, అప్కాస్ యూనియన్, ఇంజనీరింగ్ సెక్షన్ రెగ్యులర్, అప్కాస్ యూని యన్, జనరల్ హస్పిటల్ అప్కాస్ వర్కర్లు, రైల్వే అప్కాస్ వర్కర్ల యూనియన్ నాయకులు, సిబ్బంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీజీ భరత్ వీరికి కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లా డుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలు నష్టపోయాయని, టీడీపీతోనే న్యాయం జరుగుతుందని అన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎంవీ సత్యనారాయణ, ఎస్ ప్రభాకర్‌రెడ్డి, రత్నం, సీ.రాజు, నాగరాజు, చంద్ర, సీ.రమేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి: ఐదేళ్ల భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాలని టీజీ భరత్ కోరారు. సోమవారం మౌర్యఇన్‌లోని తన కార్యాలయంలో వివిధ వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. మతం పేరు చెప్పి ఓట్లు అడిగే వా రిని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీలో చేరిన వారిలో 23 వ వార్డు నుంచి మద్దిలేటి, నరసింహులు, గోపాల్, పెద్ద గోపాల్, లక్ష్మన్న, సాయి కుమార్, భరత్, 47వ వార్డు ధర్మపేటకు చెందిన తిమ్మప్ప, సల్మాన్, లక్ష్మన్న, 6వ వార్డు చెందిన గడ్డాకు చెందిన గౌస్‌పీర్, మోయిన్, విజయ్, అబ్దుల్లా 12వ వార్డు బాపూ జీ నగర్‌కు చెందిన ఉపేంద్ర, జలీల్, ఖాసీం ఉన్నారు.

● **ఉచిత ఇసుక విధానం అమలు చేస్తాం:** టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం మౌర్యఇన్‌లో పరిణయ హాలులో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రంగాలు వైసీపీ పాలనలో కుదేలై పోయాన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నాయకులు బొల్లెద్దుల రామక్రిష్ణ, దేవా పాల్గొన్నారు.


మౌర్యఇన్ కార్యాలయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్న యువత

ఫ్యాన్‌కు ఓటేస్తే ఉరేసుకోవాల్సిందే: టీజీ భరత్

కర్నూలు(అర్బన్),ఏప్రిల్ 22: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తే ఉరేసుకునే పరిస్థితి ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 25వ వార్డులో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. దేవనగర్, గాయత్రి ఎస్టేట్, బిర్లగడ్డలో ఇంటింటికి తిరిగారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యదవ్, నాగయ్య, మధు, మహేష్, బాలు, కల్లుశ్రీనున, సుధాకర్‌రెడ్డి, సత్యరాజ్, రమణయ్యశెట్టి, మధు, మహబూబ్ బాషా, మద్దిలేటి, కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు అర్జా రామక్రిష్ణ, జనసేన నాయకులు పవన్ పాల్గొన్నారు. భరోసా ముగిసిన అనంతరం బిర్లా గడ్డలో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యం : డీసీసీ అధ్యక్షుడు

కర్నూలు(అర్బన్) ఏప్రిల్ 22: కాంగ్రెస్ నాయకులు దయచేసి రాజీనామాలు చెయొద్దని అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే బాబురావు కోరారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం కొత్త వ్యక్తులను ఎన్నికల అభ్యర్థులుగా ప్రకటించడం కొంత వరకు బాధాకరమేనన్నారు. అయినా అందరూ కష్టపడి ప్రకటించిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, పీజీ నరసింహులు యాదవ్, అనంతరత్నం, సత్యనారాయణ, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు సస్పెన్షన్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 22: కర్నూలు మండలం పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎంవీ శేషఫణి రాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో శామ్యూల్ సోమవారం తెలిపారు. సాధారణ ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారనే ఫిర్యాదులు అందడంతో దీనిపై విచారణ నిర్వహించి సస్పెండ్ చేసినట్లు ఆయన వివరించారు.

సైనికుల్లా పని చేయండి: టీడీపీ

ఓర్వకల్లు, ఏప్రిల్ 22: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ఓర్వకల్లులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి బూత్‌లో కూటమి అభ్యర్థులకు మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. అలాగే ఈ నెల 24న పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత కర్నూలులో నామినేషన్ వేయనున్న సందర్భంగా మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ఎల్లారెడ్డి, అల్లాబాబు, జయ న్న, గుట్టపాడు చిన్న, వేణుగోపాల్ రెడ్డి, యాసిన్ పాల్గొన్నారు.

శబరి నామినేషన్‌కు తరలిన నాయకులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 22: నంద్యాల పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి నామినేషన్‌కు సోమవారం ఓర్వకల్లు మండలంలోని వివిధ గ్రామాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ డ్రామాలను ప్రజలు నమ్మరు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 22: జగన్ గులకారాయి డ్రామాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చీకట్లో వచ్చిన గులకరాయి ముఖ్యమంత్రి జగన్‌కు తగిని అక్కడే ఉన్న వెల్లంపల్లికి తగిలి గాలిల్లో ఎగిరి పోవడం మరో కోడి కత్తి డ్రామా లాంటిదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో డ్రామాల పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

గోరంట్ల గురుకులం విద్యార్థుల ప్రతిభ

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో గోరంట్ల బీసీ బాలుర గురుకుల పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వీరాంజనేయులు తెలిపారు. మహేష్ (586), నిఖిల్ (581), మంజునాథ్(572) మార్కులతో ప్రతిభ కనబరచారని తెలిపారు. పులకుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో 49 శాతం, వర్కూరు 20.50 శాతం, కల్లపరి 40 శాతం, ప్యాలకుర్తి 58 శాతం, అమడగుంట్ల 34.50 శాతం, లద్దగిరి 32 శాతం, గోరంట్ల 46 శాతం, కేజీబీవీ 51 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వసంతలక్ష్మీ తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరుగుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ జి.సృజన ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జరుగుతున్న మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీ లించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగ రాజు, ఈఈ సురేష్, డీఈ రవిచంద్ర పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువ తెలుసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 22: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువ తెలుసుకోవాలని ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ అన్నారు. సోమ వారం నగర పాలక సంస్థ అధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సోషల్ డెవపలప్‌మెంట్ స్పెషలిస్టు పెంచలయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్, బీఎల్‌ఓలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

సి.బెళగల్, ఏప్రిల్ 22: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు రేపల్లె పౌలు అన్నారు. సోమ వారం మండలంలోని ముడుమాల గ్రామంలో ఆయన బాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు హనుమతంతు, మోజెష్, భాస్కర్, రాజు, ఆనంద్‌కుమార్, బజారి, రాముడు పాల్గొన్నారు.

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిక


గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన 27వ వార్డు వైసీపీ నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 22: కల్లూరు అర్బన్ 27వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు పవన్, విక్రమ్, కళ్యాణ్, సిద్దూతోపాటు 20 కుటుంబాలు సోమవారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీలో చేరిన ట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చరణ్, దినేష్, శేషు, మహీ ధర్, సుదర్శన్, వర్ధన్, ఇస్మాయిల్, అభి, తిరుమాళ్ ఉన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

● 36వ వార్డు డ్రైవర్స్ కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు శ్రీనివాసులతో పాటు 20 కుటుంబాలు టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వ ర్యంలో గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

● పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గౌరు చరితకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు. సోమవారం మాధవీనగర్‌లోని గౌరు నివాసంలో ఆయన్ను కలిసి తమ మద్దతు ప్రక టించారు.

● **వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి: గౌరు వెంకటరెడ్డి**

వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 19వ వార్డు ఎలుకూరు ఏస్టేట్‌లో ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డు ఇన్‌చార్జ్ ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

పది ఫలితాల్లో గురుకులం విద్యార్థుల ప్రతిభ


సూర్యతేజారెడ్డి


నవదీప్ రెడ్డి


ప్రకాష్

ఓర్వకల్లు, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో ఏపీఆర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు తెలిపారు. మండలం లోని కాల్వబుగ్గ ఏపీఆర్ గురుకుల పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో ప్రథమ స్థానంలో సూర్యతేజారెడ్డి 588/600, ద్వితీయ స్థానంలో ఎస్‌వీ నవదీప్ రెడ్డి 584, తృతీయ స్థానంలో ప్రకాష్ 583 మార్కులు సాధించారు. 56 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మండలంలోని కన్నమడకల 23 మంది పరీక్షలు రాయగా.. 17 మంది ఉత్తీర్ణులయ్యారు. ఓర్వకల్లులో 121 మందికి గానూ 71 మంది, మోడల్‌స్కూల్‌లో 94 మందికి గానూ 77 మంది, కస్తూర్బా పాఠశాలలో 40 మందికి గానూ 33 మంది పాస్ అయ్యారు. శకునాల 39 మందికిగానూ 20 మంది, హుశేనాపురంలో 44 మందికి గానూ 18 మంది, సోమయాజులపల్లెలో 40 మందికి 23 మంది, పూడిచెర్లలో 25 మందికి 13 మంది , నన్నూరులో 128 మందికిగానూ 78 మంది, మీదివేములలో 74 మందికిగానూ 40 మంది పాస్ అయ్యారు. అలాగే ఉయ్యాలవాడలో 67 మందికి గానూ 44 మంది, లొద్దిపల్లెలో 62 మందికిగానూ 21 మంది, బుగ్గరామేశ్వర పాఠశాలలో 42మందికి 37 మంది పాస్ అయినట్లు ఎంఈవోలు ఓంకార్ యాదవ్, ప్రభావతమ్మలు తెలిపారు.


బీ.జగన్

సి.బెళగల్ ఏప్రిల్ 22: మండలంలో పదో తరగతిలో గత ఏడాది కంటే ఈ సంవత్సరం ఉత్తీర్ణ శాతం తగ్గింది. మండలంలోని జడ్పీ ఉన్నత, గురుకుల, కస్తూర్బా పాఠశా లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు మొత్తం 793 పరీక్షలు రాయగా, 420 మంది విద్యార్థులు ఫెల్ అయ్యారు. 373 మంది విద్యా ర్థులు పాసు అయ్యారు. అందులో ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బీ.జగన్ 569, రోహిన్ 551, సిబెళగల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వంశీ 563 మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయలు తెలిపారు.

పదిలో సత్తా చాటిన ప్రభుత్వ విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో కర్నూలు నగరంలోని డా.ఏపీజే అబ్దుల్‌కలాం మెమోరియల్ మున్సిపల్ కార్పొరే షన్ హైస్కూల్ హ్యాట్రిక్ సాధించింది. మూడుసార్లు వరుసగా అత్యధిక మార్కులు సాధించింది. సోమవారం విడులైన పది ఫలితాల్లో 48 మందికి గాను 48 మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. షేక్ ఉమేరా ఇక్బాల్ 593/600, కేఎన్ కృతి 586, జేఎల్ మారుతి 585 మార్కులు సాధించారు. 550 మార్కులకు పైగా 29 మంది విద్యార్థులు, 500 మార్కులకు పైగా 13 మంది, 450 మార్కులకు పైగా 5 మంది, 400 మార్కులకు పైగా ఒకరు మార్కులు సాధించారు. విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అధ్యాపకుల కృషి ఫలితమేనని డీఈవో శామ్యూల్ తెలిపారు.

జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి


మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి


సంగాలలో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్, ఏప్రిల్ 22: పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిన జగన్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో గ్రామాల్లో బొగ్గుల దస్తగిరి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలంతా సైనికుల్లా పని చేసి టీడీపీని గెలిపించాల న్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఈరన్నగౌడు, జడ్పీటీసీ గిరిజోన్, మల్లికార్జున గౌడు, రేపల్లె పౌలు, శేషన్న, రాంబాబు, లక్ష్మన్న, చంద్రశేఖర్, బాలాజి వెంకటేశ్ పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది టీడీపీనే: విష్ణు

కర్నూలు(రూరల్): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టీడీపేనని పార్టీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామానికి చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతోపాటు గ్రామ పెద్దలతో సోమవారం విష్ణు ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ రాష్ట్రంలో అన్ని సర్వేలు టీడీపీ వైపే చెబుతున్నాయన్నారు.

● నగరంలో ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో కోడుమూరు నియోజకవర్గ పరి ధిలో ఉన్న బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో టీడీపీకి మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్యఅతిగా హాజరై మాట్లాడారు. బీసీ కులాలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. ఈసమావేశంలో బీసీ నాయకులు నవీన్‌కుమార్, అయ్యన్నయాదవ్, బాలసంజన్న, మాజీ ఎంపీపీ గిడ్డయ్య, కృష్ణాజిరావు, ప్రభాకర్, సంపత్, మద్దిలేటి, వెంకటేష్ పాల్గొన్నారు.

● కోడుమూరు నియోజకవర్గ బీజేపీ నాయకులు మురళీనాయుడు, లక్ష్మణ్‌నాయుడు, రఘునాథ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. విష్ణును కలిసిన వారిలో నాయకులు ఈరన్న, రాఘవయ్య, ఆచారి, నాగభూషణ్‌రెడ్డి, వంగూరు రాజు ఉన్నారు.

‘పది’ ఫలితాల్లో విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సురేష్


కేశవరెడ్డి పాఠశాలల విద్యార్థులు


నారాయణ పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి


ప్రతిభ కనబరిచిన రవీంద్ర పాఠశాల విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన మాంటిస్సోరి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న రవీంద్ర విద్యాసంస్థల వైస్ చైర్మన్ వంశీధర్


ప్రతిభ పాఠశాల విద్యార్థులు

పది ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

కర్నూలు(ఎడ్యుకేషన్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఏజీఎం సురేష్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ 590 మార్కులు పైగా 34 మంది, 580 మార్కులకు పైగా 92 మంది, 570 మార్కులపైన 173 మంది, 550 మార్కులపైన 324 మంది సాధించినట్లు తెలిపారు.

కేశవరెడ్డి విద్యార్థులు..

పది ఫలితాల్లో కేశవరెడ్డి పాఠశాలల ఐఐటీ, మెడిసిన్ ఫౌండేషన్ విద్యార్థులు రాణించారు. అత్యధిక మార్కులు సాధించిన ఎస్.సాయి స్వాతేజ్ 597, ఎస్.ప్రశాంత్ 596, కె.భావన 596, ఎస్.రజియా సుల్తానా 596, ఎస్.జయాన్ 595, ఎస్.రోశిని షిరీన్ 594, పి.సుగంధిని రెడ్డి 593, జి.రోహిణి 593, ఏ.జీవన్‌శ్రీ 593, ఎం.భార్గవి 592, బి.లాస్య(590)లను పాఠశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.కేశవరెడ్డి అభినందించారు.

నారాయణ విద్యార్థులు..

పది తరగతి ఫలితాల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారనీ ఏజీఎం రమేష్ కుమార్ తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన కేదారేశ్వర (595), అజయ్ (595), టి.హరిత, శ్లోక, ఇందిరా ప్రియదర్శిని, ఎం.వైభవ్, కేవీ లోహిక (594)లను కోఆర్డినేటర్ బాగ్యలక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అన్వర్‌బాషా, కోఆర్డినేటర్స్ శ్రీలక్ష్మి, శ్రీహరి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాకతీయ పాఠశాల విద్యార్థులు..

స్థానిక మద్దూరునగర్‌లోని కాకతీయ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ కనబరిచారు. సి.సాయిపవన్ 578/600, ఎం.సాయిసుమలత 577, హరిత 571 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ ఎం.సుమతి, హెచ్ఎం కె.రామస్వామి అభినందించారు.

కేవీఆర్ పాఠశాలలో..

కేవీఆర్ గార్డెన్స్‌లోని కేవీఆర్ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో రాణించారని పాఠశాల కరస్పాండెంట్ సాధూ శ్రీనివాసరెడ్డి తెలిపారు. తస్లీం (586), హబీబా (585), సానియా (584), ఆసియా ఇఫత్ (558), రుమానా తరుణం (557), జగత్ విఖ్యాత్ సాయి (517) మార్కులు సాధించారు.

సాయిసుబ్బయ్య రవీంద్ర విద్యార్థులు..

స్థానిక మాధవీనగర్‌లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్, రెవెన్యూ కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో రాణించారని కరస్పాండెంట్ పీటీవీ సుబ్బయ్య తెలిపారు. అబ్దుల్ వహబ్ (576), ఉదయ్ తేజ్ (576), నదీం 571 మార్కులు, చరణ్‌తేజ్ రెడ్డి (570), శివకుమార్ (568), రాజప్రణిత (563), జాహ్నవి (558), ప్రహర్షిణి (551) తదితరులు ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు.

ప్రతిభ మోడల్ స్కూల్ విద్యార్థులు..

పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ మోడల్ స్కూల్ విద్యార్థులు రాణించారు. వి.సాయి ఉషశ్రీ 589, కె.మనోజ్ 586, అర్షియా అంజుమ్ 559, కె.మహేష్ రెడ్డి 558, కె. లిఖిత 555, జ్వాలాశ్రీ 552, ఏ.ఉషశ్రీ 550, షేక్ షహనాజ్ 523, ఏ.ఈశ్వర్ 520, కె.అనీదమ్మ 518 మార్కులు, భార్గవ్ 514, కె.జ్యోత్స్న 513, సాహితి 506, జితేంద్ర 500 మార్కులు సాధించారు. వీరిని డైరెక్టర్ అరుణాచల రెడ్డి, కరస్పాండెంట్ శ్రీదేవి అభినందించారు.

రవీంద్ర విద్యార్థుల విజయకేతనం

స్థానిక అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాణించారు. పాఠశాల అత్యధిక మార్కులు యోగేంద్రనాథ్ రెడ్డి 594 మార్కులు సాధించగా.. ఎస్.శివరామక్రిష్ణ 593, సాయి సుశ్మిత వైష్ణవి 592, ఎం.సాయిశ్రీ రెడ్డి, 591 మార్కులు సాధించారు. 575 మార్కులకు పైగా 29 మంది, 550కి పైగా 55 మంది, 500 మార్కులకు పైగా 91 మంది విద్యార్థులు సాధించారన్నారు. విద్యార్థులను రవీంద్ర విద్యాసంస్థల వ్యవ స్థాపకులు జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, అకడమిక్ అడ్వైజర్ మమతా మోహన్, వైస్ చైర్మన్ వంశీధర్‌లు అభినందించారు.

మాంటిస్సోరి విద్యార్థులు..

స్థానిక విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత మాట్లాడుతూ పది ఫలితాల్లో వరుసగా 595, 594, 593, 592 మార్కులతో పాటు 46 మంది విద్యార్థులు 550 మార్కులు, 87 మంది విద్యార్థులకు 500పైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను, అధ్యాపకులను పాఠశాల కరస్పాండెంట్ కేఎంవీ రాజశేఖర్ అభినందించారు. విద్యానగర్ పాఠశాలకు చెందిన కె.నాగశృతివర్షిణి 595, ఫాతిమా 594, కె.రుతిక 593 మార్కులు సాధించారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, రమాజ్యోతి, మీనాక్షి విల్సన్‌లు అభినందించారు.

అట్టహాసంగా బస్తిపాటి నాగరాజు నామినేషన్


నామినేషన్ వేయడానికి వెళ్తున్న బస్తిపాటి


ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 22: తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజు నామి నేషన్ అట్టహాసంగా చేశారు. సోమవారం ఉదయం టీడీపీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలు దేరి కలెక్టరేట్ వరకు వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ఎన్నికల సమన్వయకర్త, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఆలూరు, పత్తి కొండ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు అభ్యర్థి టీజీ భరత్, కేఈ శ్యామ్ బాబు, ఆకెపోగు ప్రభాకర్, ఎన్నికల రిటర్నింగ్ రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్ర మంలో బత్తిన వెంకటరాముడు, నంద్యాల నాగేంద్ర, పోతు రాజు రవికుమార్, జే.తిరుపాల్, సత్రం రామక్రిష్ణుడు, హనుమంతరావు చౌదరి పాల్గొన్నారు.




టీడీపీ శ్రేణుల భారీ ర్యాలీ

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

సమష్టి కృషితో విజయం సాధిస్తాం

● కూటమి కార్యకర్తలంతా సైనికుల్లా కదలాలి
● టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు పురుషోత్తంరెడ్డి
● బీజేపీ, టీడీపీ, జనసేన సంయుక్తంగా సమావేశం



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి, పురుషోత్తంరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 22: నియోజకవర్గంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి రాఘవేంద్రరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు, ఆదోని డివిజన్ ఇన్‌చార్జి, హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తంరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బీపీఆర్ ఫామ్‌హౌస్‌లో బీజేపీ, టీడీపీ, జనసేన సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. ఇసుక, మద్యం, మైనింగ్, గంజాయి, దౌర్జన్యాలు, గూండాగిరి, రౌడీయిజం చేసి రూ.లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో జగన్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి, దేశంలో బీజేపీ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అన్ని విధాలా అబివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డిని ఛీకొడుతున్నారని అన్నారు. కార్యకర్తలంతా సైనికుల్లా కదలి కష్టపడి రాఘవేంద్రరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ, రాష్ట్ర నాయకులు కురువ రాముడు, టీడీపీ సీనియర్ నాయకులు రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 70 కుటుంబాలు టీడీపీలో చేరిక

పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి గ్రామానికి చెందిన 70 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. సోమవారం నాయకులు దుమ్ముల శివన్న, తలారి చిన్న యాపిలయ్య, చిన్న నరసన్న ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చిన్న నరసన్న, నరసింహులు, తలారి గోవిందు, ఉరుకుందు, వీరస్వామి, లింగన్న, హనుమంతు, శ్రీనివాసులు, మల్లేష్, తిమ్మారెడ్డి, మజ్జిగ శాంతన్న, వంకన్న, నాగరాజుతో పాటు దాదాపు 100 మంది టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి నామినేషన్



నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేస్తున్న రాఘవేంద్రరెడ్డి

టీడీపీ, జనసేన, బీజేపీ మంత్రాలయం నియోజకవర్గ కూటమి అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి రాఘవేంద్రస్వామిని దర్శించుకుని సోమవారం నామినేషన్ వేశారు. సాదాసీదగా మూడు వాహనాల్లో రాఘవేంద్రరెడ్డి ఆయన సోదరులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, కుమారుడు రాకేష్ రెడ్డిలతో పాటు కురువ సంఘం నాయకులు మల్లికార్జున, లాయర్లు టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, అడ్వకేట్ ఆనంద్ వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం మంత్రాలయం గడ్డపై టీడీపీ జెండా ఎగురవేసి టీడీపీకి పూర్వ వైభవం తెస్తామని రాఘవేంద్ర రెడ్డి అన్నారు. టీడీపీ నాయకులు వరదరాజులు, తెర్నెకల్ రఘు, సీఎస్‌వీ మధుసూదన్ ఆచార్, బొజ్జప్ప, భీమిరెడ్డి, నాగరాజు, రామక్రిష్ణ, నాగేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కేవీఆర్

మద్దికెర, ఏప్రిల్ 22: మద్దికెర గ్రామానికి చెందిన కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లి మార్చి 31న రోడ్డు ప్రమాదానికి గురై ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మద్దికెర గ్రామానికి చెందిన మాజీ సర్పంచు కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి ఆ ఐదు కుటుంబాలకు రూ.లక్ష విరాళంగా అందజేశారు. కూలీల కుటుంబ పరిస్థితి తెలుసుకున్న వెంకటేశ్వరరెడ్డి స్పందించి ఈ విరాళాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వరరెడ్డిని కవిరెడ్డి రామాంజులు, కవిరెడ్డి గోపాల్, కవిరెడ్డి కృష్ణ, చిన్న మద్దన్న, నాగభూషణం రెడ్డి, పలువురు అభినందించారు.

పెళ్లి ఇంట విషాదం

● గుండెపోటుతో తండ్రి మృతి ● రెండు రోజుల్లో కూతురు పెళ్లి

మంత్రాలయం, ఏప్రిల్ 22: మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో విషాదం అలుముకుంది. అంగడి బోయ పెద్ద వీరేష్ (45) గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఉదయం కూతురి పెళ్లి ఏర్పాట్లు చేస్తుండగా.. గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కూలిపోయాడు. మృతునికి ఒక కుమారుడు వినోద్, కూతురు శ్రావణి ఉన్నారు. శ్రావణికి ఈ నెల 26న ఆదోని మండలంలోని దానాపురంలో వివాహం జరిపించాలని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంట్లో పెళ్లి బాజాబజంత్రీలు మోగాల్సి ఉండగా.. ఈ సంఘటన జరగడంతో విషాదం నెలకొంది. మృతునికి భార్య మీనాక్షి ఉన్నారు.

పది పరీక్షల్లో అక్షరశ్రీ అగ్రస్థానం



టాపర్‌లతో డైరెక్టర్ మేఘనాథ్ రెడ్డి



భరణి 595

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 22: పట్టణంలో అక్షరశ్రీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల ఫలితాల్లో మరోసారి టాపర్లుగా నిలిచి సత్తాచాటారు. భరణి అనే విద్యార్థినికి 595/600, హుమేరా, సాదియా, సానియా తబుసమ్‌లకు 593 మార్కులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ మేఘనాథ్ రెడ్డి తెలిపారు. సిద్ధార్థ, శ్రీవిద్యలకు 592 మార్కులు రాగా, 590 పైగా మార్కులు సాధించిన వారు ఏడుగురు ఉన్నారని తెలిపారు. తమ విద్యార్థులు ప్రణాళిక, పట్టుదలతో విజయాన్ని అందుకున్నారని పాఠశాల డైరెక్టర్ మేఘనాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ఓటుల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

కిడ్డీస్ ప్రభంజనం

● 597 మార్కులతో రాష్ట్రంలో మూడో టాపర్‌గా హర్షవర్ధన్

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షల ఫలితాలలో



హర్షవర్ధన్ 597, హరిక 595, శ్రీధర్ రెడ్డి 596



హర్షవర్ధన్ (597)కు స్వీట్లు తినిపిస్తున్న కిడ్డీస్ డైరెక్టర్లు

పట్టణంలో కిడ్డీస్ విద్యాసంస్థలు ప్రభంజనాన్ని సృష్టించాయి. హర్షవర్ధన్ అనే విద్యార్థికి 597/600 మార్కుల సాధించి రాష్ట్రంలోని మూడవ టాపర్‌గా నిలిచారు. శ్రీవల్లి, శ్రీధర్ రెడ్డి, నవీన్‌లకు 596/600 మార్కులతో నాలుగో స్థానం రాగా, హరిక, ఐశ్వర్య, హర్షిత, పూజిత, అమిదాల ఐశ్వర్యలకు 595/600 మార్కులు సాధించారని ఆ పాఠశాల డైరెక్టర్లు కేశవ నారాయణ రెడ్డి, చిన్నపురెడ్డి తెలిపారు. 595 మార్కులు పైగా సాధించిన వారు 9 మంది విద్యార్థులు, 590 మార్కులు సాధించిన వారు 28 మంది, 550 పైగా మార్కులు సాధించిన వారు 142 మంది, 500 పైగా మార్కులు సాధించిన వారు 195 మంది ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రం, జిల్లాలో టాపర్‌గా నిలవడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు స్వీట్లు పంచి సంతోషం వ్యక్తం చేశారు.

నేషనల్ విద్యార్థుల ప్రతిభ

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాలలో



శివరాజ్ 590 సారిమా అంజిమ్ 579 అభినవ్ 573

పట్టణంలోని నేషనల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి శివరాజుకు 590 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలువగా, ద్వితీయ స్థానంలో సారియా అంజిమ్ 579తో తృతీయ స్థానంలో, అభినవ్ 573 మార్కులు సాధించినట్లు తెలిపారు. విజయానికి కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మిస్టర్ సత్యశ్రీ, హెడ్‌మాస్టర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్21: గుడికల్లు గ్రామానికి చెందిన లక్ష్మన్న(28) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మన్న తన భార్యతో హనుమాపురంకు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాల సమీపంలో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మన్నకు తీవ్ర గాయాలై మృతి చెందారని తెలిపారు. మృతుడికి భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

వైభవంగా ఫక్కీరప్ప స్వామి జాతర

మద్దికెర, ఏప్రిల్ 22: ఎం.అగ్రహారం గ్రామంలో అవధూత ఫక్కీరప్ప స్వామి జాతర ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

టీడీపీ హయాంలోనే పట్టణాభివృద్ధి : బీవీ



మిలటరీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న బీవీ



ఆర్వోకు బీఫారం అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు , ఏప్రిల్21: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఎమ్మిగనూరు పట్టణం విస్తృతంగా అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని మిలటరీ కాలనీ, సాయినగర్ ప్రాంతాల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. కాలనీలో మహిళలతో ఏర్పాటు చేసిన ముఖాముఖి సమావేశంలో టీడీపీ మెనిఫెస్టోలో ప్రకటించిన సూపర్-6 పథకాలను మహిళలకు, కాలనీవాసులకు క్లుప్తంగా వివరించారు. సూపర్-6 పథకాలతోనే మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎమ్మిగనూరు పట్టణం నేడు ఇంతలా అభివృద్ధి చెందిందంటే తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి హయాంతో పాటు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. పట్టణానికి తాగునీరు అందించాలని రూ.146 కోట్లతో జీడీపీ నుంచి పైపులైన్ తెస్తే రివర్స్ టెండర్ పేరుతో వైసీపీ అడ్డుకొందని విమర్శించారు. పట్టణ శివారు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకు ఎవరు బాధ్యులో ప్రజలు తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాందాసుగౌడు, దయాసాగర్, నాయకులు కొండయ్యచౌదరి, సుందర్‌రాజు, రంగన్న, వడ్డె కృష్ణ, జయన్న, రామకృష్ణనాయుడు, ముల్లాఖలీముల్లా, కటారి రాజేంద్ర, మిన్నప్ప, గుల్లా సలాం, ఈశ్వర్, రవి లు పాల్గొన్నారు.

ఆర్వోకు బీఫారం అందజేసిన బీవీ

ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సోమవారం ఆర్వో చిరంజీవిని కలిసి టీడీపీ అభ్యర్థిగా బీఫారాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బసాపురం, దేవిబెట్ట, కొటేకల్లు గ్రామాల్లో బీవీ విస్తృత ప్రచారం

ఎమ్మిగనూరు రూరల్ : బసాపురం, దేవిబెట్ట, కొటేకల్లు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు మాజీ ఎంపీపీ శంకరయ్య, పార్లపల్లి మల్లికార్జున, కొటేకల్లు ఖాజా, దేవిబెట్ట సోమశ్వరరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మహిళలు

పట్టణంలోని 9వ వార్డుకు చెందిన తటస్థ మహిళల మస్తాన్‌బీ, హసీనా, రాబియా, షేకన్‌బీ, సలీమా, మాబ్బి, షాజా, ఆయిషా, మహమ్మద్‌బీలతో పాటు దూద్‌పీరా మరో 50 మంది మహిళలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన మహిళలు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



ప్రచారం నిర్వహిస్తున్న వీరభద్రగౌడ్ , చిన్నారిని ఎత్తుకుని ఇంటింటి ప్రచారం, మరో సెట్ నామినేషన్ వేస్తున్న వీరభద్ర గౌడ్

● టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ విస్తృత ప్రచారం
● మరో రెండు సెట్ నామినేషన్ల దాఖలు

ఆలూరు, ఏప్రిల్ 22: సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కలిగేలా వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్ర గౌడ్ అన్నారు. సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా కరిడిగుడెం, ముద్దనగేరి గ్రామల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు అవుతాయన్నారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్ ప్రయాణం, ఏడాదికి రూ.3 సిలిండర్లు, ప్రతి మహిళలకు నెలకు రూ.1500 పింఛన్లు, ఏడాదికి రైతన్నలకు రూ.20 వేలు, యువగళం పథకం ద్వారా యువతకు 50 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి చేసే టీడీపీకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా చిన్నారిని ఎత్తుకొని ప్రచారం చెప్పట్టారు. 'అవ్వా... ఎన్నికల్లో నీ ఓటు సైకిల్ గుర్తుకే వేయాలని 80 ఏళ్ల వృద్ధురాలిని' వీరభద్రగౌడ్ కోరారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి. రాంభీం నాయుడు. హరిరెడ్డి, భీమలింగప్ప, వేమన్న, రామదాస్, బొగ్గు రాముడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మరో రెండు సెట్ నామినేషన్లు..

టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్, ఆయన కుమారుడు గిరిమల్లేష్ గౌడ్ మరో సెట్ నామినేషన్‌లను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాము నాయక్‌కు అందజేశారు. 18 నుంచి 22వ తేదీ వరకు మొత్తం 4 నామినేషన్ల వచ్చినట్లు ఆర్వో తెలిపారు.

కురవళ్లి సర్పంచు రవికుమార్ టీడీపీలో చేరిక

మండల పరిధిలోని కురువళ్లి గ్రామ సర్పంచు రవికుమార్ వీరభ్యర్థి వీరభద్ర గౌడ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయకేతనం ఎగరవేస్తామని వీరభద్ర గౌడ్ అన్నారు.



క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ శివనారాయణ స్వామి

ఆదోని, ఏప్రిల్ 22: ఆదోని త్రీ టౌన్ పోలీసులు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు బెట్టింగ్ నిర్వాహకులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 2.5 లక్షల నగదుతో పాటు 4 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం డీఎస్పీ శివనారాయణ స్వామి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముంబై ఇండియన్స్-రాజస్థాన్ రాయల్స్ మధ్య ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నిర్వాకులైన మరాఠి గేరికి చెందిన మహానంది, రమేష్, కార్వాన్‌పేటకు చెందిన వినోద్, షహీద్ అనే వ్యక్తులు ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో ఉన్న కల్వరికొండ దగ్గర చెట్టు కింద క్రికెట్ నిర్వహిస్తుండగా గమనించి త్రీటౌన్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. రెండున్నర లక్షలు నగదుతో పాటు నాలుగు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహానంది అనే వ్యక్తి చెడు అలవాటుకు బానిసై అప్పులు చేసి జల్సాలకు పాల్పడుతూ, క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బు సంపాదించాలన్న ఆశతో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెట్టింగ్‌లో వచ్చిన మొత్తాన్ని నెలూర్లు జిల్లా కావలి చెందిన కాజా అనే వ్యక్తికి బెట్టింగ్ పాల్పడిన మొత్తాన్ని పంపించి రూ.1000కి రూ.200 ప్రకారంగా కమిషన్ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరెవరు సహకరించారో వారందరినీ కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. బెట్టింగ్ కేసును చేదించిన సీఐ నరసింహరాజు, సిబ్బంది నరేంద్ర, పరుశురాం, పరమేష్, గిరిబాబు, నరసింహులు, ఇస్మాయిల్‌లను డీఎస్పీ అభినందించారు.

అట్టహాసంగా సీపీఐ అభ్యర్థి నామినేషన్



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 22: సీపీఐ పత్తికొండ అభ్యర్థి రామచంద్రయ్య నామినేషన్ కార్యక్రమం సోమవారం పత్తికొండలో అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పత్తికొండకు చేరుకున్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్టుహౌస్ నుంచి కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబూని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్ పేదలకు అభివాదం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఎన్నికల అధికారి రామలక్ష్మికి సీపీఐ అభ్యర్థి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మురళి మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు బారీ బందోబస్తు నిర్వహించారు.

మంత్రాలయం కాంగ్రెస్ అభ్యర్థిగా మురళీ దొర

కోసిగి, ఏప్రిల్ 22: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం పలువురు ఆశావాహులు తీవ్రంగా ప్రయత్నించారు. అందులో ఒకరైన కోసిగికి చెందిన మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ రాజు కుమారుడు మురళీదొరకు కాంగ్రెస్ అసెంబ్లీ టికెట్‌ను ఖరారు చేశారు. ఆదివారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ చేతుల మీదుగా మురళీదొర రాజు బీఫారం అందుకున్నారు.

ఘనంగా పీఠాధిపతి జన్మదిన వేడుకలు

మంత్రాలయం, ఏప్రిల్ 22: రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు 53వ జన్మదినం పురస్కరించుకుని ఘనంగా జరుపుకున్నారు. మఠం ఎంప్లాయిస్ అసోసియేషన్ కాంట్రాక్టు యూనియన్ ఎన్ఎంఆర్‌లు, సంభావన కింద పని చేసే ఉద్యోగులు పీఠాధిపతిని సోమవారం ఘనంగా సన్మానించారు. మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, వాదిరాజాచార్, రమణారావ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిగా కొటేకల్లు వాసి నామినేషన్



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఉరుకుందు

కర్నూలు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థి కోటెకల్లు వడ్డే ఉరుకుందు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామానికి చెందిన ఈయన ఎన్నికల బరిలో తానుసైతం అంటూ నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను కలెక్టర్, ఎన్నికల అధికారి సృజనకు అందజేశారు.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక

పత్తికొండ/తుగ్గలి ఏప్రిల్ 22 : తుగ్గలి మండలపరిదిలోని రాంపల్లి గ్రామానికిచెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పత్తికొండలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే తుగ్గలి మండలం ఉప్పర్లపల్లికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ సోమశేఖర్ కేఈ సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే తుగ్గలికి చెందిన 17 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి.

పదో తరగతి ఫలితాలు విడుదల

పదోతరగతి ఫలితాలు సోమవారం విడదుదలయ్యాయి. వివిధ మండలాల్లో ఫలితాల వివరాలను ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. హాలహర్వి మండలంలో పదవ తరగతి ఉత్తీర్ణతలో మరింత వెనుకబడింది. మొత్తం 422 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం 182 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

పత్తికొండ మండలం 59.47 శాతం : మండలంలో పదోతరగతి పరీక్షల్లో 59.47 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో 2 రమేష్ తెలిపారు. మండలపరిదిలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పరిధిలో మొత్తం 1125 మంది పరీక్షలు రాయగా 669 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

మద్దికెరలో అత్తెసుర ఫలితాలు : మద్దికెర జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 70 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా.. కేవలం 20 మంది మాత్రమే పాసయ్యారు. అలాగే మండలంలోని ఎం.అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాలలో 20 మందికి గానూ 5 మంది మాత్రమే ఉత్తీర్ణులయినట్లు మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు.

ఎమ్మిగనూరులో 57.79 శాతం : మండలంలోని అయా పాఠశాలల్లో పదోతరగతి ఫలితాల్లో 57.79 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఆస్పరిలో 52 శాతం : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆయా పాఠశాలల విద్యార్థులు 52 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తిరుమలరావు తెలిపారు.

తుగ్గలిలో 39.78 శాతం ఉత్తీర్ణత : మండలంలో పదోతరగతి ఫలితాల్లో 39.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 538 మంది పరీక్షలు రాయగా.. 214 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో రమావెంకటేష్ గౌడు తెలిపారు.

మంత్రాలయంలో 43.07 శాతం : పదోతరగతి ఫలితాల్లో 43.07 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ మైనుద్దీన్ తెలిపారు.